

రూ.ఎనిమిది వేలు వడ్డీ చెల్లించాలని రైతు దయాకర్‌రెడ్డికి బ్యాంకు అధికారులు తెల్ల కాగితంపై పంపిన నోటీసు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనం

- విజయవంతంగా అమలు చేయాలి
- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 : ఆగస్టు 5 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో స్వచ్ఛదనం-పచ్చదనంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, గ్రీనరీని పెంచడమే లక్ష్యంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 5 నుంచి ఆగస్టు 9 వరకు నిర్వహించాలని అన్నారు. ఆగస్టు 5న జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలు, ప్రతీ పట్టణ వార్డులో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రజలను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వనాలలో చనిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటి సంరక్షించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రతీ రోజు ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసి వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి, ఆశా కార్యకర్త, వీపీవోలతో కమిటీని ఏర్పాటు చేసుకుని నిర్దేశిత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువగా ఆస్కారం ఉన్నందున పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు వారికి సబంధించిన మండలాల్లలో, నియోజకవర్గల్లలో వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ హాస్టల్‌లను ఆకస్మికంగా సందర్శించి పరిశుభ్రత, తాగునీరు, వంటశాలలను పరిశీలించలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో పీడీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాల వివరాలివే..

ఆగస్టు 5 తాగునీరు వర్షపు నీటి సంరక్షణ, 7న కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతలు పూడ్చడం, 8న ఆరోగ్యం, వీధి కుక్కల బెడదపై దృష్టి, 9న ప్రభుత్వ సంస్థలను, ప్రభుత్వ స్థలాలను శుభ్రపర్చడం.

ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు పంట రుణాలను మాఫీ చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీతో కలిపి రెండు లక్షల రూపాయల వరకు మాఫీ చేయాల్సి ఉంది. అందులో భాగంగా ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.లక్షన్నర వరకు మాఫీ చేసింది. అయితే, కొందరు రైతులు రంగారెడ్డి జిల్లా కందుకూరు ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు తీసుకుంటే.. వారికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్, ఘట్‌కేసర్, శామీర్‌పేట బ్యాంకుల్లో రుణమాఫీ అయినట్టుగా జాబితా విడుదలైంది. దీనికి తోడు కందుకూరు సహకార సంఘంలో అధికారులు రైతులకు పూర్తి వడ్డీ కాకుండా తక్కువ మొత్తంలో మాఫీ చేసి మిగతాది చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రుణం ఒకచోట.. మాఫీ మరోచోట!

రుణాలు రెన్యూవల్ చేసుకోకపోవడంతోనే..

రైతులు తీసుకున్న పంటరుణం ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలి, కానీ మా సంఘంలో లక్ష లోపు పంటరుణం తీసుకున్న రైతులు నాలుగు సంవత్సరాల వరకు రెన్యూవల్ చేయక పోవడం వలన వారికి ఏడాది వడ్డీ మాత్రమే మాఫీ అయింది. మిగిలిన మూడేళ్ల వడ్డీ వసూలు చేస్తున్నాం. వడ్డీతో కలిపి రూ. రెండు లక్షల వరకు మాఫీ ఇవ్వాలన్న నిబంధనలు మా సంఘం ఇవ్వలేదు.

- నిమ్మ యాదగిరిరెడ్డి, సహకార సంఘం సీఈవో, కందుకూరు

- రెండో విడతలో రుణమాఫీ కాని రైతులు వందల్లో..
- రైతుల నుంచి వడ్డీ వసూలు చేస్తున్న బ్యాంకు అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు

అధికారుల నిర్లక్ష్యంతో రైతుల తీవ్ర ఇబ్బందులు

కందుకూరు, ఆగస్టు 2 : కందుకూరు సహకార సంఘంలో పంట రుణాలు తీసుకుంటే.. మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట, ఘట్‌కేసర్, మేడ్చల్ సహకార సంఘ కార్యాలయాల్లో రుణమాఫీ అయింది. దీంతో రైతులు అవాక్కవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు రుణమాఫీ డబ్బుల కోసం 15 రోజులుగా సహకార సంఘం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9 వరకు బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణం తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినా సహకార సంఘంలో దానికి భిన్నంగా వ్యవహారం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా కొత్తగూడెంనకు చెందిన దయాకర్‌రెడ్డి 2018 డిసెంబరులో రూ.20వేలు రుణం తీసుకున్నాడు. దీనికి గాను రూ.9,317 వడ్డీ అయింది. అయితే, బ్యాంకు అధికారులు దీనిలో వడ్డీ రూ. రూ.1,1317 మాత్రమే మాఫీ అయినట్టుగా చూపి మిగతా రూ. ఎనిమిది వేల వడ్డీ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అది కూడా నోటీసు కాకుండా తెల్ల కాగితంపై వేసి రైతులకు అందిస్తున్నారు. దీంతో ఆ రైతు ఆవేదనకు గురవుతున్నాడు. ఇలా చాలామంది రైతుల నుంచి వడ్డీ డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమాఫీ చేసినప్పటికీ మా వద్ద డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కందుకూరు మండల సహకార సంఘం అధికారులు వెయ్యి రూపాయల నుంచి లక్ష వరకు పంట రుణం ఉన్న 1,568 మంది రైతుల వివరాలను మొదటి విడతలో ఆ సంఘం జిల్లా కార్యాలయానికి అందించారు. అందులో కేవలం 565 మంది రైతులకు మాత్రమే పంటరుణం మాఫీ అయినట్లు అధికారులు కార్యాలయంలో జాబితాను పెట్టారు. లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు పంట రుణం ఉన్న 291మంది రైతుల వివరాలను రెండో విడతలో జిల్లా కార్యాలయానికి అందించగా.. అందులో 231 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు లిస్టు పెట్టారు. కానీ, ఇంకా 10,069 మంది రైతులకు రుణం మాఫీ కాలేదని, ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సహకార సంఘం అధికారులు రైతులకు తెలిపారు. దాంతో రైతులు ఏఈవోలను సంప్రదించి ఆధార్ కార్డు ద్వారా వివరాలను పరిశీలిస్తే.. కొందరు రైతులకు మేడ్చల్ సహకార సంఘంలో రుణమాఫీ మంజూరైనట్లు, మరికొందరికి శామీర్‌పేట, ఇంకొందరికి ఘట్‌కేసర్ సహకార సంఘం కార్యాలయంలో మాఫీ అయినట్లు తేలింది. తాము కందుకూరు సహకార సంఘంలో పంటరుణం తీసుకుంటే రుణమాఫీ ఇతర సహకార సంఘం కార్యాలయాల్లో కావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పంటరుణం డబ్బులను అధికారులు తమ ఖాతాల్లోకి జమ చేయాలని కోరుతున్నారు.

రైతుల వివరాలను జిల్లా కార్యాలయానికి పంపించాం



2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తమ సంఘం ద్వారా రుణాలు తీసుకున్న 1,981 మంది రైతుల వివరాలను రుణమాఫీ మంజూరు కోసం జిల్లా కార్యాలయానికి పంపించాం. ఇప్పటివరకు 796 మంది రైతులకు రుణాలు మాఫీ అయ్యాయి. కొందరు ఇక్కడ రుణం తీసుకుంటే వేరే సహకార సంఘాల్లో మాఫీ జరిగినట్లు రైతుల ద్వారా మా దృష్టికి వచ్చింది. సీఈవో ద్వారా జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాం.

- డి.చంద్రశేఖర్, సహకార సంఘం చైర్మన్, కందుకూరు

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



పంట రుణం డబ్బులు అర్హులైన రైతులందరికీ వర్తింపజేస్తాం. ఆధార్ నంబర్లు వేరే సహకార సంఘం కార్యాలయాల్లో నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక్కడ జరిగిన పొరపాట్లపై నోడల్ అధికారికి సమాచారం ఇచ్చాను.

- వై.లావణ్య, మండల వ్యవసాయాధికారి

కందుకూరులో తీసుకుంటే మేడ్చల్‌లో మాఫీ అయింది



నేను కందుకూరు సహకార సంఘం కార్యాలయంలో రూ.55 వేల రుణం తీసుకున్నా. రుణమాఫీ ప్రకటన తర్వాత సహకార సంఘం కార్యాలయానికి వెళ్లి అడిగితే లిస్టులో పేరు రాలేదని అధికారులు చెప్పారు. ఏఈవో వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటే ఆధార్ కార్డు మేడ్చల్ సహకార సంఘం కార్యాలయంలో పుట్టు సత్తయ్య పేర రూ.13,834 మంజూరైనట్లు చూపిస్తోంది. అధికారులు నా పంటరుణం డబ్బులను వెంటనే మంజూరు చేయాలి.

-ఎడ్ల నర్సింహ, రైతు, కందుకూరు



కొందుర్గులో నాటు వేస్తున్న వలస కూలీలు

మీకు మెతుకు.. మాకు బతుకు!

- సేద్యానికి వలస కూలీలు
- వరినాట్లకు బయటి రాష్ట్రాల నుంచి రాక
- రెండు నెలల పాటు ఇక్కడే మకాం



వలస కూలీల కోసం వేసిన షెడ్

కొందుర్గు, ఆగస్టు 2: సాగు చేస్తేనే అన్నదాతకు నాలుగు మెతుకులు కలుగుతాయి. దానికి కూలీల సాయం తప్పనిసరి. అయితే పారిశ్రామికీకరణతో స్థానికులు ఎక్కువ మంది పరిశ్రమల్లో పనులకు పోతున్నారు. దీంతో వ్యవసాయానికి కూలీల కొరత ఏర్పడింది. ఇక్కడ వ్యవసాయ పని దొరుకుతుందని వివిధ రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. స్థానికంగా కూలీల కొరతతో రైతులు ఇతర రాష్ట్రాల కూలీలవైపు మొగ్గు చూపుతున్నారు. వలస కూలీలు రెండు నెలలు ఇక్కడే మకాం వేసి, సాగు పనులు చేస్తున్నారు. చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూలీల రాక పెరుగుతోంది. కూలీలు మగవారు ఒక బృందంగా, ఆడవారు ఒక బృందంగా, ఆడమగ కలిసి ఒక బృందాలుగా వరినాట్లు వేస్తున్నారు. కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రిలో శుక్రవారం పదుల సంఖ్యలో వలస కూలీలు పొలాల్లో వరినాటు వేశారు. లేబర్ కాంట్రాక్టర్లు కర్ణాటక, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల కూలీలను తీసుకువస్తున్నారు. 40 నుంచి 50 మంది కూలీలను ఒక్కో గ్రామానికి తరలిస్తున్నారు. వారికి మధ్యవర్తి స్థానికంగా షెడ్లు ఏర్పాటు చేసి గ్యాస్ సిలిండర్లను, బియ్యం ఇస్తాడు. కూలీలు కూరగాయలు తెచ్చుకొని వండుకుంటారు. ఒక్కో షెడ్‌లో 15 నుంచి 25 మంది ఉంటారు. లేబర్ కాంట్రాక్టర్ ఎకరం వరి నాటుకు రైతుతో 4వేల వరకు మాట్లాడుకుంటాడు. కూలీలకు 3,500 వరకు చెల్లిస్తాడు. ఒక్కో బృందంలో 12 నుంచి 17 మంది కూలీలు ఉంటారు. వీరు ఉదయం 5గంటలకే పొలానికి వెళ్తారు. ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు టిఫిన్ చేస్తారు. మధ్యాహ్నం 2గంటలకు భోజనం చేస్తారు. సాయంత్రం చీకటిపడే వరకు నాటు వేస్తారు. ఒక్కో కూలీల బృందం రోజుకు 4 ఎకరాల నుంచి 6 ఎకరాల నాటు వేస్తారు. సాయంత్రం మధ్యవర్తి షెడ్ వద్దకు వచ్చి తెల్లవారి ఎవరి పొలానికి వెళ్లాలో చెబుతాడు. అయితే పనుల విషయంలో కూలీలకు, రైతుకు భాష సమస్యగా మారింది. కూలీలకు కన్నడ, హిందీ మాత్రం వస్తాయం. దీంతో పొలాల యజమానులు మధ్య వర్తితో మాట్లాడుతూ కూలీలతో సమన్వయం చేసుకుంటున్నారు. పురుష కూలీలు భార్య, పిల్లలను, మహిళా కూలీలు భర్త, పిల్లలను వదిలి వచ్చి రెండు నెలల పాటు ఇక్కడ పనులు చేస్తారు. ఖర్చులు పోను రెండు నెలల్లో ఒక్కో కూలీ 25వేల నుంచి 40వేల వరకు సంపాదిస్తారు.

మన కూలీలకు 9వేలు.. వలస కూలీలైతే 4వేలే!

మన కూలీలతో ఎకరం పొలం నాటువేస్తే 8వేల నుంచి 9వేల వరకు ఖర్చు వస్తుంది. వరి నారు అందించే కూలీకి అదనంగా రైతే చెల్లించాలి. మన కూలీలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకే పనిచేస్తారు. వలస కూలీలకు 4వేలు ఇస్తే, నారు వారే వేసుకుంటారు. అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని రైతులు చెబుతున్నారు. వలస కూలీలతో ఎకరానికి 5వేలు ఆదా అవుతుందని పేర్కొంటున్నారు.

ఈ ప్రాంతాల నుంచి రాక

బతుకుదెరువు కోసం వలస కూలీలు వస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింధనూర్ గ్రామానికి చెందిన పింటూ, జమున, రీనా, సంగీత, పార్వు, లంకేశ్, బసంతి, వీణ, ప్రదీప్, జూదీస్‌టీ, జెబ్బతి, అభిజిత్ ఉన్నారు. అలాగే ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర రాంపూర్ జిల్లా రుద్రాపూర్‌నకు చెందిన విశాల్, బిషార్, మహదేవ్, సాగర్, సోనా, నర్తం, నియోత్తం, విశ్వజిత్, సహదేవ్, సంజీత్‌రాయ్, రామ్‌కిషోర్, అనూఫ్, అమల్, పరిమల్, విజయ్, హమీద్, గౌర్ కూలి పనులకు వచ్చారు. చత్తీస్‌ఘడ్‌లోని ఎంసీజీ జిల్లా పరిధి చిర్మిరికి చెందిన రామ్‌మిశ్రా, హనుమాన్, వినయ్ రేగడి చిల్కమర్రిలో వరినాట్లు వేసేందుకు వచ్చారు.


వలస కూలీలతో డబ్బు ఆదా



వరి నాట్లకు కూలీల కొరత ఉంది. వలస కూలీలపై ఆధారపడుతున్నాం. మన కూలీలు ఎకరానికి రూ.7వేల నుంచి 9వేలు అడుగుతున్నారు. నారు అందించే కూలీకి అదనం. సాయంత్రం దావత్‌కు వేరేగా డబ్బులివ్వాలి. దీంతో కూలీల ఖర్చు ఎక్కువవుతోంది. వలస కూలీలు ఎకరం నాటుకు 4వేలే తీసుకుంటున్నారు. అన్ని పనులూ వారే చేసుకుంటారు. వలస కూలీలతో రైతుకు ఎకరానికి 5వేల కూలిఖర్చు మిగులుతుంది.

- బందులాల్, రైతు, రేగడి చిలకమర్రి

మా రాష్ట్రంలో పనులు దొరకవు



మా రాష్ట్రంలో వర్షాకాలంలో పనులు తక్కువ దొరుకుతాయి. కూలి రేట్లు కూడా తక్కువగానే ఉంటాయి. అందుకే వరినాట్లు వేసేందుకు ఇక్కడికి వస్తున్నాం. ఇక్కడ కూలి ఎక్కువ ఇస్తున్నారు. ప్రతీ సంవత్సరం రెండు నెలలు ఇక్కడే ఉండి వరినాటు పనులు చేస్తుంటాం.

- జమున, కూలీ, కర్ణాటక

రెండు నెలల్లో 40వేల వరకు వస్తాయి



రెండు నెలలు ఇక్కడే ఉండి వరినాట్లు వేస్తాం. మమ్మల్ని తోలుకొచ్చిన మధ్య వర్తి మాకు పొలాల వివరాలు చెప్పి నాటు వేయిస్తారు. మేము ఉండేందుకు షెడ్‌ను, వంటకు గ్యాస్ సిలిండర్, బియ్యం మధ్యవర్తి ఇస్తాడు. కూరగాయలు, ఇతర ఖర్చులు పోను రెండు నెలల్లో 30వేల నుంచి 40వేల వరకు సంపాదించుకుంటాం.

- పింటూ, కూలీ, కర్ణాటక

అమ్మపాలు అమృతం

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 : అమ్మపాలు అమృతమని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు మొదటి వారమంతా తల్లిపాల అవగాహనా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాల్లో బిడ్డకు తల్లిపాల ప్రాధాన్యత ఎంత అవసరమో వివరించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అవగాహప కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తల్లిపాల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో వైద్య సిబ్బందితో కలిసి గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పిస్తామని మహిళా శిశు సంక్షేమాధికారి పద్మజా రమణ తెలిపారు.



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రైతులు మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలి

- జేడీఏ గీతారెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 2 : రుణమాఫీ పొందిన రైతులు మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. శుక్రవారం ఆమె ఆలూర్, బస్తేపూర్, చేవెళ్ల, కుమ్మెర తదితర గ్రామాల్లో పర్యటించి రుణమాఫీ అయిన రైతులతో మాట్లాడారు. అనంతరం ఆలూర్ గ్రామంలోని ఎస్‌బీఐ మేనేజర్‌తో రైతుల రుణమాఫీ గురించి చర్చించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులందరికీ రెండు విడతలుగా రుణమాఫీ చేసిందన్నారు. రుణాలు మాఫీ అయిన రైతులు కొత్త రుణాలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. అర్హులైన రైతులు ఈ నెల 5వ తేదీ వరకు రైతు బీమా కోసం వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడీఏ రమాదేవి, ఏవో తులసి, ఏఈవోలు బాలకృష్ణ, రమేష్, వరుణ్, రైతులు బోజిరెడ్డి, నర్సింలు, ఎం.లక్ష్మారెడ్డి, వీరేశం, మల్లారెడ్డి, రాంచంద్రయ్య, వెంకటయ్య పద్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మట్లాడుతున్న గీతారెడ్డి



మొగలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రం చేయాలి

శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



షాద్‌నగర్, ఆగస్టు 2 : ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి శాసనమండలి దృష్టికి తెచ్చారు. శుక్రవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన మొగలిగిద్దను మండల కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని మౌలిక వసతులు ఉన్నాయని చెప్పారు. ఆ గ్రామంలోని పాఠశాలలో విద్యనభ్యసించిన బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ స్టేట్ తొలి సీఎంగా పనిచేశారని, అలాగే సత్యనారాయణరెడ్డి మాజీ గవర్నర్‌గా, హరగోపాల్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో 75వేల జనాభా ఉందని, ఇందులో నుంచి 35వేల జనాభాను కలుపుకుని మొగలిగిద్దను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య



మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, ఆగస్టు 2: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సీపీఐ చేవెళ్ల నియోజకవర్గం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. ఎన్నికలప్పుడు వృద్ధులకు ఇస్తామన్న కొత్త పింఛన్‌ను సైతం అందించాలని తెలిపారు. రైతులు తీసుకున్న మాఫీపోను వడ్డీ డబ్బులు కట్టాలని అధికారులు ఒత్తిడి చేయడం న్యాయం కాదని, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలని సూచించారు. చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎండీ మక్బూల్, వడ్ల మంజుల, మండల కార్యదర్శిగా వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యదర్శిగా కె.శ్రీనివాస్, శంకర్‌పల్లి మండల కార్యదర్శిగా సుధీర్, షాబాద్ మండల కార్యదర్శిగా నక్క జంగయ్యతో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, మండలాల కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అంకుశాపూర్‌లో పర్యటించిన డీఆర్డీవో

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2 : అంకుశాపూర్‌లో శుక్రవారం డీఆర్డీవో సాంబ శివరావు పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణంలోని రికార్డులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాల, ప్రాథమిక పాఠశాల, నర్సరీని పరిశీలించారు. రేషన్ దుకాణంలోని రికార్డులు పరిశీలించి లబ్ధిదారులు ఎంతమంది? రేషన్ కార్డులు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఎంతమంది ఉన్నారు? పౌష్టికాహారం అందించే విషయాన్ని అడిగి రికార్డులు తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో సదుపాయాల కల్పన, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలోని హాస్టల్ సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతారెడ్డి, ఏపీఎం తౌర్యానాయక్ పాల్గొన్నారు.

స్కూల్ ఆటో బోల్తా

- పలువురు విద్యార్థులకు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



పూడూరు, ఆగస్టు 2 : స్కూల్ ఆటో బోల్తా పడి విద్యార్థులకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడి సింగపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పరిగి టీచర్స్ కాలనీలోని మదర్సా స్కూల్ నుంచి ఆటోలో 12 మంది విద్యార్థులు బొంరాస్‌పేట్‌కు వెళ్తున్నారు. గడి సింగాపూర్ సమీపంలోకి రాగానే కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించేందుకు డ్రైవర్ బాబయ్య ఆటోను తిప్పడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులను 108 అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లి అంత్యక్రియలకు రాని కూతుళ్లు

- భూమి ఇవ్వాల్సి వస్తుందనే..
- మూడు రోజులకు కొరివిపెట్టిన మనుమడు
- మహదేవ్‌పూర్‌లో ఘటన

కొందుర్గు, ఆగస్టు 2: ఆస్తి కోసం మానవ సంబంధాలను కొందరు మరిచిపోతున్నారు. తల్లి తనకిచ్చిన ఆస్తిని మేనల్లుడు అడుగుతున్నాడని తల్లి అంత్యక్రియలకు ముగ్గురు కూతుర్లు రాలేదు. ఈ అమానవీయ ఉదంతం కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌లో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్నమ్మ, అంతిరెడ్డి దంపతులకు చిన్నారెడ్డి, జనార్ధన్‌రెడ్డి అనే ఇద్దరు కుమారులు, యాదమ్మ, లక్ష్మమ్మ, ఉమారాణి అనే ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పిల్లలు చిన్న వయసులోనే అంతిరెడ్డి మరణించాడు. తమకున్న రెండెకరాల పొలంలో సాగు చేసి చిన్నమ్మ పిల్లలను పెంచి, పెళ్లిళ్లు చేసింది. జనార్ధన్‌రెడ్డి-సంధ్యారాణి దంపతులకు ఒక కొడుకు సాకేత్‌రెడ్డి ఉన్నాడు. సాకేత్‌రెడ్డి 11నెలల వయసులోనే తల్లి సంధ్యారాణి మరణించింది. సాకేత్‌రెడ్డిని మేన మామలు ఖమ్మం జిల్లా కొత్తగూడానికి తీసుకుపోయారు. జనార్ధన్‌రెడ్డి రెండో పెండ్లి చేసుకోలేదు. తల్లితోనే గ్రామంలో ఉంటున్నాడు. ప్రతీ వేసవి సెలవుల్లో సాకేత్‌రెడ్డి మహదేవ్‌పూర్ వచ్చేవాడు. ఇదిలా ఉంటే చిన్నారెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు 20సంవత్సరాల క్రితం ఏడు ఎకరాల పొలాన్ని కొన్నారు. చిన్నారెడ్డి పొలాన్ని తన భార్య పేరు మీద పట్టా చేశాడు. జనార్ధన్‌రెడ్డికి భార్య లేకపోవడంతో, తన వంతు మూడున్నర ఎకరాలు తల్లి చిన్నమ్మ పేరిట పట్టా చేశాడు. అయితే 2006లో ఎలికట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్ధన్‌రెడ్డి మృతిచెందాడు. చిన్నమ్మ పేరు మీద సర్వే నంబర్ 338లో ఉన్న 3.5ఎకరాల పొలాన్ని చిన్నమ్మ రెండో కూతురు లక్ష్మమ్మ(జాఫర్‌పల్లి) పట్టా చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సాకేత్‌రెడ్డి తన తండ్రి పొలాన్ని తనకు తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగాడు. కానీ మేనత్త లక్ష్మమ్మ భూమి ఇవ్వలేదు. సాకేత్‌రెడ్డి పెళ్లి చేసుకొని హైదరాబాద్‌లోని తెల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. చిన్నమ్మ(80) అనారోగ్యం పాలవడంతో 20రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఆమెకు షుగర్ ఎక్కువ కావడంతో ఒక కాలు తీసేయాలని వైద్యులు చెప్పడంతో, వారం రోజుల క్రితం ఉస్మానియా ఆసుపత్రిలో కుడి కాలు తొలగించారు. చిన్నమ్మను మంగళవారం ఉదయం మహదేవ్‌పూర్‌నకు తీసుకొచ్చారు. ఆమె కోలుకోలేక బుధవారం ఉదయం చనిపోయారు. తన తల్లిదండ్రులు చనిపోవడంతో తాను అనాథగా మిగిలానని, నాన్నమ్మ కూడా చనిపోయిందని, తన తండ్రి సంపాదించిన మూడున్నర ఎకరాల భూమిని తనకు ఇస్తే, నాన్నమ్మ అంత్యక్రియలు చేస్తానని సాకేత్‌రెడ్డి అన్నాడు. దీంతో తనపేరు మీద ఉన్న భూమిని అంత్యక్రియల అనంతరం పట్టా చేస్తానని సాకేత్‌రెడ్డితో లక్ష్మమ్మ చెప్పింది.



చిన్నమ్మ మృతదేహం వద్ద బంధువులు

దీనిపై ఒప్పందం రాసివ్వాలని సాకేత్‌రెడ్డి కోరాడు. దీంతో బుధవారం ముగ్గురు మేనత్తలు మహదేవ్‌పూర్ నుంచి వెళ్లిపోయారు. గురువారం వారి కోసం ఎదురుచూశారు. ఎంతకూ వారు రాకపోవడంతో, గ్రామస్థులు పెద్దకుమారుడు చిన్నారెడ్డితో మాట్లాడి సాకేత్‌రెడ్డితో శుక్రవారం చిన్నమ్మకు అంత్యక్రియలు చేయించారు. భూమి అడుగుతారని ముగ్గురు కూతుళ్లు కనిపెంచిన తల్లి అంత్యక్రియలకు రాకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు హర్షణీయం

- ఎమ్మార్పీఎస్ నాయకులు



కడ్తాల : మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు నిర్వహించారు. రాజీవ్‌చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మల్లే పోగు మల్లేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వగ్గు మహేశ్, జంతుక యాదయ్య, జంతుక జానయ్య, పులికంటి మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మాదిగల మూడు దశాబ్దాల పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. నాయకులు మంగళపల్లి నర్సింహ, గురిగళ్ల లక్ష్మయ్య, ముత్తి కృష్ణ, కాలే వెంకటేశ్, మంకి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అవసరమని తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిర్ర శీను తెలిపారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ మాదిగ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పాలాభిషేకం చేశారు. దశరథ్, చంద్రయ్య, జాను, భాస్కర్ భీమయ్య, కిష్టయ్య, రామచంద్రయ్య, జంగయ్య, తదితరులున్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణ చారిత్రత్మకమని జనసేన సీనియర్ నాయకుడు, కేశంపేట మండల ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అవసరమని చెప్పిన ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కందుకూరు : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పును అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నట్లు గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్‌లు మన్ను బాబు, గౌర ప్రభాకర్‌లు తెలిపారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నాయకులు మన్ను మహేష్, మల్లేష్, వెంకటేష్, సురేష్, బాబురావు. తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిందని మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్.. శంషాబాద్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు మదిలేటి, రాచమల్ల దాస్, చిట్టిబాబు, కండక్టర్ యాదయ్య, భాస్కర్, పరందాములులతో సహా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులను పూలమాలలు శాలువాలతో సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు బూరుకుంట సతీష్, కొనమొల్ల శ్రీనివాస్, మోహన్ రావు, రాజేందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కందుకూరు : గుమ్మడవెల్లిలో అంబేడ్కర్ విగ్రహం పాదాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కేశంపేట : మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎమార్పీఎస్ నాయకులు

రాష్ట్రంలో అత్యుత్తమ స్పోర్ట్స్ పాలసీ

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



క్వీని విక్టోరియా, స్టీఫెన్ కుమార్‌లను సన్మానిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 2: దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అత్యుత్తమ స్పోర్ట్స్ పాలసీ ని తీసుకువస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. అందుకు సంబందించి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ గందం క్వీని విక్టోరియా ఇటీవల ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 36 కిలోమీటర్లు స్విమ్ ఎవరెస్ట్ గా పిలుచుకునే ఇంగ్లీష్ చానెల్ ఈది రికార్డు సృష్టించింది. తొలి తెలుగు ఓపెన్ వాటర్ మహిళా స్విమ్మర్‌గా క్వీని రికార్డు నెలకొల్పింది. అదేవిదంగా క్వీని కుమారుడు స్టీఫెన్ కుమార్ రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్ పూర్‌లో ఇటీవల జరిగిన అండర్ వాటర్ ఫిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో మూడు పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటాడు. ఈ నేపథ్యంలో క్వీని విక్టోరియా, స్టీఫెన్ కుమార్ లు శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఇంగ్లీష్ చానెల్ ఈది అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు నెలకొల్పడం తెలంగాణ కు గర్వకారణమని అన్నారు. చిన్న వయస్సులోనే జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌లో స్టీఫెన్ కుమార్ రాణించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్వీని కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేయూతనందించి ప్రోత్సాహం అందేలా చూస్తానని కసిరెడ్డి హామి ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాల తోడ్పాటునందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రతిభ ఆదారంగానే గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కందుకూరు మండలం ముచ్చర్ల సమీపంలో త్వరలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేసి ప్రతిభ కలిగిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నారాయణరెడ్డి తెలిపారు. క్వీని, స్టీఫెన్ కుమార్ లకు తన వంతు తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ మాజీ ఛైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పాల శీతలీకరణ కేంద్రం ఛైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

ఐదు నెలల తర్వాత నేడు కౌన్సిల్ సమావేశం

- హాజరుకానున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ప్రజా సమస్యలు చర్చకు వచ్చేనా!
- విలీన కాలనీలకు రావాల్సిన నిధులేవి?



తాండూరు, ఆగస్టు 2: ఎట్టకేలకు తాండూరు మున్సిపాలిటీ సాధారణ సమావేశం నిర్వహణకు వేళయింది. ఐదు నెలల తర్వాత ఈనెల శనివారం(నేడు) మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎన్నికల తర్వాత జరుగుతున్న సాధారణ సమావేశం కావడంతో సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలు చర్చకు వస్తాయా? ఎజెండా అంశాలతోనే సరి పెడుతారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారు. 30 అంశాలపై ఎజెండాను రూపొందించి కౌన్సిల్ సభ్యులకు పంపించారు. ప్రస్తుతం వర్షాకాలంతో పలు కాలనీలో వరదలు, రోడ్లు దెబ్బతిన్నడం, కాలనీలు జలమయమవ్వడం, మురుగు కాల్వలు అపరిశుభ్రంగా మారడం, అస్తవ్యవస్థమైన పరిపాలన కొనసాగుతుండడం, వీధిదీపాల సమస్య, వార్డుల్లో అభివృద్ధి పనులు వంటి వాటిపై చర్చ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా బురదమయమైన రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కౌన్సిలర్లు, ప్రజలు కోరుతున్నారు.

విలీన కాలనీలకు నిధులేవి?

2019మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం మున్సిపాలిటీలో విలీనమైన కాలనీలకు ప్రత్యేక నిధులు కేటాయించింది. కానీ తాండూరు మున్సిపాలిటీ ఈనిధుల ప్రస్తావనే తీసుకురావడంలేదు. 2018లో తాండూరు మున్సిపాలిటీలోకి ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కొడంగల్ రోడ్డులోని మార్కండేయ కాలనీ, రసూల్‌పూర్ ఏరియా, కోకట్‌రోడ్డు, చించోలి రోడ్లలోని బసవేశ్వర కాలనీలు విలీనమయ్యాయి. కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ఈ కాలనీ లకు బడ్జెట్ నుంచి ప్రత్యేక నిధుల కేటాయింపు జరగలేదు.

'ఆంధ్రజ్యోతి'లో నెలక్రితమే కథనం

జూలై 7న 'కౌన్సిల్ మిటింగ్ ఎప్పుడో?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు గడిచినా సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేయకపోడంపై ప్రచురితమైన ఈ కథనంతో స్థానికంగా చర్చ మొదలైంది. ఎట్టకేలకు నేడు సమావేశం జరగనుంది.



క్యాబ్ డ్రైవర్లతో చర్చలు జరుపుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

క్యాబ్ డ్రైవర్లతో పోలీసుల చర్చలు సఫలం

- ఇతర రాష్ట్రాలకు చెందిన మూడు క్యాబ్‌లు సీజ్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 2 : తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు స్పందించిన స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, జీఎంఆర్ రక్షా సిబ్బంది గురువారం ఏసీపీ కె.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ట్రాఫిక్, ఎంవీఐ పోలీసులు, క్యాబ్ డ్రైవర్లు, ఓలా, ఉబెర్ మేనేజర్లతో చర్చలు జరిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్యాబ్‌లు ఎయిర్‌పోర్టులో రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో స్థానిక క్యాబ్ డ్రైవర్లు.. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం క్యాబ్ డ్రైవర్లతో ఏసీపీ మాట్లాడుతూ ఆర్టీఏ యాక్ట్ ప్రకారం.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్యాబ్‌లు కేవలం ప్రయాణికులను డ్రాప్ తప్ప పికప్ చేసుకోకూడదని, అలా తీసుకెళ్లే క్యాబ్‌ను సీజ్ చేస్తామని స్థానిక క్యాబ్ డ్రైవర్లకు హామీ ఇచ్చారు. సమ్మతించిన క్యాబ్ డ్రైవర్లు ఆందోళన విరమించి తిరిగి యథావిధిగా క్యాబ్‌లను నడిపించారు. ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ మూడు ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. చర్చల్లో ట్రాఫిక్ సీఐ రాజు, ఆర్జీఐఏ సీఐ బాల్‌రాజు, ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, జీఎంఆర్ అధికారులు, క్యాబ్ యూనియన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలి

- రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు జిల్లా చీఫ్ ప్రమోటర్ వినతి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 : జిల్లా మత్స్యశాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరుతూ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక అలా (ఐఏఎస్)కు జిల్లా చీఫ్ ప్రమోటర్ గోరెంకల నర్సింహ శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా మత్స్య శాఖ అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఇద్దరు అధికారులపై సస్పెన్షన్‌కు గురైనట్లు, దీంతో రెగ్యులర్ డీఎఫ్‌వో, సూపరిండెంట్‌ను నియమించపోవడం వల్ల నూతన సొసైటిల ఏర్పాటు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. అధికారులు లేక ఎన్నో సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పేరుతో గతంలో ఉన్న ఎడి హోదాను రంగారెడ్డి జిల్లాకు కల్పించాలని కోరాకు. జిల్లా మత్స్య శాఖకు రెగ్యులర్ అధికారులను నియమించాలని ఆయన కోరారు.

అక్రమ అనుమతులపై సమగ్ర విచారణ జరుపుతాం

కీసర, ఆగస్టు 2 : మండల కేంద్రం కీసరలో అక్రమంగా జారీచేసిన ఇళ్ల అనుమతులపై సమగ్ర విచారణ జరుపుతామని డీఎల్పీవో సాంబిరెడ్డి తెలిపారు. ఇటీవల అక్రమ అనుమతులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం కీసర గ్రామపంచాయతీలో సాంబిరెడ్డి విచారణ చేపట్టారు. పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అక్రమ అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకున్న విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామని తెలిపారు. అలాగే గ్రామంలో జరిగిన అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. అలాంటి నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

పనుల్లోని బాలలను తల్లిదండ్రుల వద్దకు చేర్చాం

- ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 2: బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకున్న వారిపై 15ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ పదో విడతలో పనుల్లో ఉన్న 173 మంది బాలలను గుర్తించి వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చామన్నారు. వీరిలో 151 మంది మగ పిల్లలు, 22 మంది బాలికలు ఉన్నారన్నారు. బాలబాలికల్లో 31మంది ఇతర రాష్ట్రాల వారు ఉన్నారన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మనందరం బాధ్యతగా కృషిచేయాలని కోరారు. ఎవరైనా బాలలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సబ్ డివిజన్ల వారీగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి ఆపరేషన్ ముస్కాన్ 10ను విజయవంతం చేసిన ప్రత్యేక బృందాల సభ్యులను ఎస్పీ అభినందించారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెద్దేముల్, ఆగస్టు 2: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మన్‌సాన్‌పల్లి, మారెపల్లితండా, మదనంతాపూర్, కొండాపూర్, రేగొండి, రుక్మాపూర్, మంబాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే పాటిస్తున్నారా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కార్యదర్శులు కొందరు ఉదయం 11 గంటలైనా గ్రామాలకు రావడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శులకు సమయపాలన చాలాముఖ్యమని, గ్రామాల్లో పర్యటించి ఎప్పటికపుడు పారిశుధ్య పనులను పరిశీలించాలన్నారు. ప్రత్యేకాధికారులు కూడా తప్పనిసరిగా పర్యటించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని కోరారు. ఇళ్లలో తొట్లు, కుండలు వంటి వాటిలో నీటినిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీఈవో రతన్‌సింగ్ ఉన్నారు.

తుదిదశకు చేరుకున్న దోర్నాల వంతెన పనులు

ధారూరు, ఆగస్టు 2: దోర్నాల అసంపూర్తి వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏడేళ్లుగా అసంపూర్తిగా ఉన్న వంతెన రాష్ట్ర శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ చొరవతో పనులను పూర్తి చేయిస్తున్నారు. వంతెనపై శుక్రవారం స్లాబ్ నిర్మించే పనులను ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. త్వరలో ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

శంషాబాద్, ఆగస్టు 2 : సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.లక్ష చెక్కును శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బాధితురాలికి అందజేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ కొత్వాల్‌గూడకు చెందిన శంకరయ్య భార్య జనని కొన్ని మాసాల క్రితం ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే దుర్గానగర్‌లోని తన ఇంట్లో బాధితురాలికి అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్.కృష్ణ, పి.సిద్ధేశ్వర్‌గౌడ్, పి.బాలయ్య, అంజి, అశోక్, వెంకటరమణ, కృష్ణ తదితరులున్నారు.

కందుకూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

కందుకూరు, ఆగస్టు 2: నగరానికి అతి సమీపంలో ఉన్న కందుకూరు మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, మండల పరిధిలోని అన్ని గ్రామాల భూములను ఆర్‌వన్ జోన్‌కు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి వినతిపత్రం ఇచ్చారు. కందుకూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి గురువారం విచ్చేసిన సీఎం రేవంత్‌కు ఆయన వినతిపత్రం ఇచ్చారు. అనంతరం జంగారెడ్డి మాట్లాడారు. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న కందుకూరు మండలంలో ఆర్‌వన్ జోన్‌కు బదులుగా అగ్రికల్చర్, తదితర జోన్‌లు ఉండటం వల్ల భూముల ధరలు అతి తక్కువగా ఉన్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కందుకూరు ఆర్డీవో కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలను ఇక్కడే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కందుకూరులో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని, హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లేన్లుగా నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చేస్తున్న నాయకులు

మాడ్గుల, ఆగస్టు 2 : మండలంలోని మారుమూల గ్రామమైన అందుగుల నుంచి ఆర్కపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు గుంతలమయమైందని, మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో అందుగుల గ్రామస్తులు కోరారు. అందుగుల వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు మరమ్మతుకు నిధులు కేటాయిస్తానని తెలిపారు.ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తదితరులున్నారు.

సామాజిక న్యాయం.. టీడీపీ ధ్యేయం

ఆమనగల్లు, ఆగస్టు 2: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని, సామాజిక న్యాయమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఆది నుంచి టీడీపీ మాదిగలకు మద్దతుగా నిలిచిందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసి దేశంలో తొలిసారిగా ఎస్సీ వర్గీకరణపై టీడీపీ ముందడుగు వేసిందన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యనారాయణ, పార్లమెంట్ కోశాధికారి అర్జం నర్సింహ, నాయకులు ఎన్‌టీ పంచాక్షరి, కండె భాస్కర్, గాజుల పద్మనాభం, తదితరులు ఉన్నారు.

సీఎం చొరవతో ఆమనగల్లుకు మహర్దశ

ఆమనగల్లు, ఆగస్టు 2: సీఎం రేవంత్‌రెడ్డి సహకారం, రాష్ట్ర ప్రభుత్వ చేయూత, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో ఆమనగల్లు పట్టణానికి మహర్దశ ఏర్పడిందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆమనగల్లు పట్టణ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎగిరిశెట్టి సత్యం మాట్లాడుతూ ఆమనగల్లు రూపు రేఖలు త్వరలో మారనున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయమన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' జయప్రదం చేయాలి

● అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2: ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీందర్‌సాగర్‌లు కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్నివార్డుల్లో చెత్తను తొలగించి మొక్కలు నాటాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురుగు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కౌన్సిలర్లు, స్వయం సహాయక సంఘాలు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.


ఇబ్రహీంపట్నం : సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీందర్‌సాగర్

ఆదిభట్ల : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు మున్సిపల్, పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ బాలకృష్ణతో కలిసి ఛైర్మన్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటడం, చెత్తా చెదారం తొలగించడం, రోడ్లపై గుంతలు పూర్చడం, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడం, మంచినీటి సరఫరా పటిష్ఠంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలను భాగసామ్యం చేయాలన్నారు. ఏఈ వీరాంజనేయులు,మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంపై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్ సురేందర్, కమిషనర్ శ్రీనివాస్, శంకర్‌పల్లి హెచ్‌సీ వైద్యురాలు రేవతి, వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాలు


షాబాద్ : కుర్వగూడలో బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలిన గ్రామస్థులు

చేవెళ్ల, ఆగస్టు 2 : మండల పరిధిలోని గుండాల గ్రామంలో శుక్రవారం ఉప్పలమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉప్పలమ్మ ఆలయానికి గ్రామస్తులు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతురాజుల విన్యాసం, డప్పు చప్పుళ్లతో ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రణతి, పుష్పకుమారి, మాజీ ఎంపీటీసీ సుజాత, మాజీ ఉపసర్పంచ్ ఎస్. బాల్‌రాజ్, సీనియర్ నాయకులు కాంత్‌రెడ్డి, గణేశ్, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

కొత్తూర్ : ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కొత్తూర్ మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మక్తగూడలో నిర్వహించిన పోచమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవంలో ఎంపీపీ పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు రాందాస్‌నాయక్, ఉప్పల దయానంద్, మోది దర్శన్, మల్లేష్, రాజు, రాములుగౌడ్, శ్రీరాములు, పాండు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : మండల పరిధిలోని చర్లగూడ, బోడంపహాడ్, మన్‌మర్రి, కుర్వగూడ తదితర గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోననైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు కొకుంట్ల రాజేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ఆంజనేయులు, పెంటయ్య, హరీశ్వర్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : గుండాలలో బోనాలు ఊరేగింపు

అమ్మపాలు అమృతంతో సమానం


యాచారం : అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

కడ్తాల్/యాచారం, ఆగస్టు 2 : అమ్మపాలు అమృతంతో సమానమని, బిడ్డలకు పాలివ్వడంలో తల్లులు నిర్లక్ష్యం చేయవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ దేవి అన్నారు. ముద్విన్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పాల్గొని గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునిత, కిష్టమ్మ, హంస, ఆశ కార్యకర్త పద్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నవజాత శిశువులకు విధిగా తల్లిపాలు పట్టాలని జిల్లా సంక్షేమాధికారి పద్మజా రమణి వెల్లడించారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. తల్లిపాల ప్రాముఖ్యతను గ్రామస్తులకు సూచించారు. తల్లిపాల ప్రాధాన్యతపై అంగన్‌వాడీ టీచర్లు తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ సర్పంచ్‌ల అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన


ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న అనురాధపత్యనాయక్, నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 2: బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం శుక్రవారం సచివాలయం ఎదుట నిరసన దీక్షకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మాజీ సర్పంచ్‌లెవరూ సచివాలయం తరలకుండా నిఘా ఏర్పాట్లు చేశారు. రాంనుంతల మాజీ సర్పంచ్ సోనశ్రీను నాయక్, కోనాపూర్ మాజీ సర్పంచ్ కడారి మల్లమ్మయాదయ్య, సీతారామ్ నగర్ తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌ల అరెస్టును నిరసిస్తూ మాజీ జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకొని అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లకు సంఘీభావం ప్రకటించారు. పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. బిల్లులు చెల్లించకుండ మాజీ సర్పంచ్ లను అరెస్ట్ చేయడం సరైంది కాదని అనురాధపత్యనాయక్ పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీలు, జిల్లా సీనియర్ నాయకుడు గుత్తి బాలస్వామి, నాయకులు తదితరులున్నారు. అదేవిదంగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని సచివాలయం ఎదుట నిరసన దీక్షకు పిలుపునిస్తే మాజీ సర్పంచ్‌ల ను అరెస్ట్ చేయడం తగదని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. నిరసన దీక్షకు వెళ్లకుండ పోలీసులు మాజీ సర్పంచ్‌లను అడ్డుకోవడం సరికాదన్నారు.

న్యాయానిదే అంతిమ విజయం

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 2: మాదిగలు, ఉపకులాల 30 ఏళ్ల కళ నెరవేర్చిన కారణజన్ముడు మందకృష్ణ మాదిగ అని, మొత్తం మీద న్యాయానిదే అంతిమ విజయమని. ఇందుకు సహకరించిన ప్రధాని మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మండలాధ్యక్షుడు కొండిగారి మహేందర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్త చేస్తూ మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. హిమాయత్ నగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంజర్ల శేఖర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు నివాళులర్పించారు.


మొయినాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జీనుకుంట్ల భాస్కర్ కోరారు. ప్రభుత్వ పథకాల్లో అర్హులైన పేదలకు అవకాశం కల్పించాలన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పద్మమ్మను భాస్కర్ పరామర్శించారు. రూ.2వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

యాచారం : ఫొటో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని, గుర్తింపు కార్డులందించాలని తదితర డిమాండ్లతో ఈనెల 6న నిర్వహించే చలో శంషాబాద్ కార్యక్రమం జయప్రదం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా కోశాధికారి మల్లేష్ కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో చలో శంషాబాద్ వాల్‌పోస్టర్‌ను మండల ఫొటో గ్రాఫర్లతో కలిసి విడుదల చేశారు. వెంకటేష్, తదితరులున్నారు.

ఆమనగల్లు : ఆదునిక సేద్యం రైతులకు అన్ని విధాల లాభదాయకమని మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి అన్నారు. సంకటోనిపల్లిలో ఏవో పర్యటించి పలువురు రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, జొన్న, వరి పంటలను ఆమె పరిశీలించారు. పంటల్లో తెగుళ్ల నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు.

షాబాద్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టును స్వాగతిస్తున్నామని బీజేపీ దళితమోర్చా మండల అధ్యక్షుడు లింగాల మహేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దశాబ్దాలుగా వెనుకబడ్డ ఎస్సీ పేద కులాలకు ఈ చారిత్రాత్మక తీర్పు వల్ల న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.

కడ్తాల్ : ఫొటోగ్రాఫర్ల జిల్లా ఆత్మీయ సమ్మేళనం, మహాసభ ఈనెల 6న శంషాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేరేపల్లి శేఖర్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ఫొటో గ్రాఫర్ల ఆత్మీయ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి ఆత్మీయ సభకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను శేఖర్‌గౌడ్ ఆవిష్కరించారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అదేవిదంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి పౌష్టికాహార విలువల గురించి అవగాహన కల్పించారు.

శంకర్‌పల్లి : జన్వాడ గ్రామాన్ని జీహెచ్‌ఎంసీలో కలుపకూడదని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ డిమాండు చేశారు. జన్వాడ గ్రామాన్ని జీహెచ్‌ఎంసీ కలుపకూడదని, గ్రామపంచాయితీ గానే ఉంచాలని కోరుతూ చేవెళ్ల ఆర్డీవో సాయిరామ్‌కు శుక్రవారం జన్వాడ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు గ్రామస్తులు గ్రామంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. గ్రామపంచాయితీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ వద్దురా... గ్రామపంచాయితీ ముద్దురా అంటూ నినాదాలు చేశారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి పట్టణంలో శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఛైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శంకర్‌పల్లిలో శునకాల నియంత్రణకు కమిషనర్ శ్రీనివాస్ బ్లూక్రాస్ సొసైటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వైస్ ఛైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు, చంద్రమౌళి, శ్రీనాథ్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

కందుకూరు : గత ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలం కోసం ఇచ్చిన సర్టిఫికెట్లను ఆధారం చేసుకొని ప్లాటు స్థలాన్ని చూపించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి మండల కేంద్రాంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

యాచారం, ఆగస్టు 2 : మండలంలోని నల్లవెల్లి రెవెన్యూ పరిధి కిషన్‌పల్లిలో సర్వేనెంబర్ 731లో రెండు ఎకరాల 38 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో ప్రభుత్వ భూమిగా రికార్డులున్నాయి. కొంత మంది రైతులు భూమిని ఆక్రమించడానికి పావులు కదుపుతున్నారని కిషన్‌పల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, ఈ విషయమై తహసీల్దార్ అయ్యప్పను వివరణ కోరగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సర్వే చేయించి హద్దులు నాటిస్తామని చెప్పారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కేశంపేట, ఆగస్టు 2: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, సీడీపీవో నాగమణి కోరారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, మహిళ, శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు అమ్మాయిలు, మహిళలకు మానవ అక్రమ రవాణాపై వివరించాలని తెలిపారు. ప్రజ్వల సంస్థ కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రజ్వల సంస్థ పనిచేస్తుందని వివరించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, ప్రజ్వల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ రైతుబీమా చేయించుకోవాలి

షాబాద్, ఆగస్టు 2 : కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులు, ఇప్పటి వరకు రైతుబీమా కొరకు నమోదు చేసుకోలేని వారు ఆగస్టు 5వ తేదీ లోపు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి రైతుబీమా పథకానికి 59 సంవత్సరాల్లోపు వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

ఆమనగల్లు, ఆగస్టు 2: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని, ఆమనగల్లును స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. వర్షా కాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చంద్రాయన్‌పల్లి తండాలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణనాయక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే ఎస్సీ వర్గీకరణ

షాద్‌నగర్, ఆగస్టు 2: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కృషితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ చేపట్టిన దండోరా యాత్రకు చంద్రబాబు నాయుడు మద్దతు తెలియజేయడమే కాకుండా ఎస్సీ వర్గీకరణ బాధ్యత కూడా తమ పార్టీ తీసుకుంటుందని ఆనాడే మందకృష్ణకు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. చెప్పులు కుట్టే చేతులే.. చరిత్ర సృష్టించాలంటూ చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగం పాలమూరు జిల్లా ప్రజలు నేటికీ మరువలేదన్నారు. 2012లో తెలుగుదేశం పార్టీ పాదయాత్ర కార్యక్రమంలో అమరవాయి మీదుగా బూడిదపాడు గ్రామం చెప్పులు కుడుతున్న హనుమంతు అనే వ్యక్తిని చూసి ఆయన కూడా చెప్పులు కుట్టారన్నారు. ఉమ్మడి ఏపీలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసింది టీడీపీ ప్రభుత్వమేనని, వర్గీకరణకు మద్దతు తెలిపినందుకు బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.


నాటి టీడీపీ బ్రోచర్‌ను చూపుతున్న బక్కని

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేవెళ్ల, ఆగస్టు 2: అతివేగంగా ఆటోను డ్రైవ్ చేస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా కోస్గి మండలం కుమ్మరికుంట తండాకు చెందిన కొర్ర నెహ్రూ నాయక్(38) భార్యా పిల్లలతో కలిసి నగరంలో మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. నెహ్రూ సొంతగ్రామంలో పనిమీద గురువారం సాయంత్రం బైక్‌పై గచ్చిబౌలి నుంచి బయలుదేరాడు. చేవెళ్ల మండలం దామరిగిద్ద గేటు సమీపంలోకి రాగానే బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. ప్రమాదంలో నెహ్రూకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బూర్గుల శివారులో మరొకరు..

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూర్గుల శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపిన ప్రకారం... బాలానగర్ మండలం మోతీఘనాపూర్‌కు చెందిన వెంకటేష్(25) బాలానగర్ నుంచి షాద్‌నగర్ వైపు బైక్‌పై వస్తుండగా షాద్‌నగర్ నుంచి బాలానగర్ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ చోరీ

షాబాద్, ఆగస్టు 2: ఎంపీడీవో కార్యాలయంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయానికి సిబ్బంది తాళాలు వేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం సిబ్బంది మెయిన్ డోర్ తాళాలు తీసి కార్యాలయంలోకి వెళ్లగా కంప్యూటర్ గది తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా కంప్యూటర్, సీపీయూ, నెట్ కేబుళ్లు కనిపంచలేవు. ఎంపీడీవో అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీతం డబ్బులు అడిగితే బెదిరింపులు

● పాఠశాల యాజమాన్యంపై కేసు

ఆదిభట్ల, ఆగస్టు 2: రెండు నెలల జీతం డబ్బులు బాకీ పడి.. ఇవ్వమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ ఇంటర్‌నేషనల్ స్కూల్ యాజమాన్యంపై బాధిత మహిళ ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించారు. దాంతో స్కూలు యాజమాన్యంపై కోర్టు ఆదేశంతో కేసు నమోదు చేసిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌కు చెందిన పరమేశ్వరి నాదర్‌గుల్‌లోని అక్షర ఇంటర్‌నేషనల్ స్కూల్లో గతేడాది సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు నెలకు రూ.10వేలు జీతంతో ఆయాగా పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం ఇంట్లో ఫంక్షన్ నేపథ్యంలో సెలవు పెట్టి వెళ్లింది. అయితే, మే నెల 10న స్కూలుకు వెళ్లి తనకు రావాల్సిన రెండు నెలల జీతం.. సెలవులు పోనూ రూ.16 వేలు రావాల్సి ఉందని, డబ్బులు ఇవ్వాలంటూ స్కూల్ ఇన్‌చార్జి అభిలాషను అడిగారు. ఛైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి స్కూలుకు రాగానే అనుమతి తీసుకొని జీతం డబ్బులు ఇస్తామని చెప్పి పంపించారు. తరువాత ఎన్నిసార్లు అడిగినా స్పందించకపోవడంతో సూపర్‌వైజర్ శ్రీనును కలవగా.. జీతం డబ్బులు ఏమీలేవని, మళ్లీ ఇక్కడికి రావద్దంటూ బెదిరించాడు. దాంతో జూలై 12న ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శుక్రవారం ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫార్మాసిటీపై దాటవేత ధోరణి తగదు

యాచారం, ఆగస్టు 2: విషతుల్యమైన ఫార్మాసిటీని రద్దు చేస్తారా లేదా అనేది ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రముఖ పర్యావరణవేత్త కవుల సరస్వతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె యాచారంలో విలేకరులతో మాట్లాడుతూ ఫార్మాసిటీ అంశంపై ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంభించడం తగదన్నారు. ఎన్నికల ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు నేడు దానిని రద్దు చేస్తామని ప్రకటన ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. నిమ్జ్ హోదా పొందిన ఫార్మాసిటీని రద్దు చేసే అధికారం వీరికుందా అని ప్రశ్నించారు.

పరిశోధనలకు సహకారం అందిస్తాం

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 2: తమ విద్యా సంస్థల్లోని విద్యార్థులు చేసే పరిశోధనలకు సహకారం అందిస్తామని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికారెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ గ్రామంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు పీహెచ్‌డీలో డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా హిమాయాత్‌నగర్‌లోని యూనివర్సిటీలో డాక్టర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికారెడ్డి ఆయనను అభినందించి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జగదీశ్వర్, సైన్స్ డీన్ సుందర్‌రాం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు పట్ల హర్షం

కందుకూరు,ఆగస్టు 2: తెలంగాణ ఉద్యమ సమయం, ప్రత్యేక రాష్ట్రం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను జానపద గేయాలతో చైతన్యం చేస్తున్న కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని అమలు చేయడం పట్ల ఆ సంఘం నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఆ సంఘం నాయకులు అనిల్, సత్యవాణిలు శుక్రవారం సాయంత్రం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. కళాకారుల జీవన స్థితిగతులు మెరుగుపడేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు

ఆమనగల్లు, ఆగస్టు 2 : వాహనాదారులు, ప్రయాణికులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేనియెడల చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.వెంకటేష్ సూచించారు. శుక్రవారం ఆమనగల్లులో శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనాల డ్రైవర్లకు ఆయన పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఎస్సై బాల్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'హైదరాబాద్-శ్రీశైలం' నక్షబాటను గుర్తించాలి


వినతిపత్రం ఇస్తున్న కృష్ణగౌడ్

కందుకూరు, ఆగస్టు 2: మండలంలోని కొత్తూరు రెవెన్యూ హైదరాబాద్-శ్రీశైలం దేవస్థానం వరకు వెళ్లే పురాతనమైన నక్షబాటను గుర్తించాలని మాజీ వైఎస్ ఎంపీపీ పల్లె కృష్ణగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం గ్రామ రైతులతో కలిసి తహసీల్దార్ కె.గోపాల్‌కు వినతిపత్ర ఇచ్చారు. కొత్తూరు రెవెన్యూ పరిధి 56, 157 సర్వే నెంబర్లలోని నక్షబాటను గుర్తించాలని, రియల్ వ్యాపారులు ఆక్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు యాదగిరి. రాజు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

యాచారం, ఆ గస్టు 2 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని జిల్లా సంక్షేమాధికారిణి, యాచారం మండల ప్రత్యేకాధికారి పద్మజారమణి హితవు పలికారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం హాస్టల్‌లో మొక్కలు నాటి బాలికల, టీచర్ల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న బోజనం వడ్డన తీరును పరిశీలించారు. హరితహారం నర్సరీని సందర్శించారు. మొక్కలు నాటించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. యాచారం, చౌదర్‌పల్లిలో హరితహారం నర్సరీలను సందర్శించి ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి నాటించాలని ఆదేశించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డితో పాటు పంచాయతీ కార్యదర్శులున్నారు.